# పాత్రలకి ప్రాణంవస్తే?



ద్విభాష్యం సూరీడు

'అలా చూడు రాధా! అక్కడో సెలయేరు కనిపిస్తోందికదా? దానిపక్కనే ఓ పెద్ద బండ వుంది చూడు! సమంగా దానిమీద కూర్చునే రాశాను నే రాసిన మొట్టమొదటి కథ!' అంటూ రాధకు ఆ ప్రదేశాన్ని పరిచయం చేశాను, వేగంగా పోతున్న మా కారులోనుంచి.

'మట్టూరా ఇంతమంచి ప్రకృతి సౌందర్యం ఉండబట్టే, ఆ కథ అంత బాగా వచ్చింది. ఇంతకీ, ఆ కథ రాయడంలో మీ గొప్పతనం ఏమీ లేదన్నమాట!' అంటూ నా భుజాన్ని పట్టుకోబోయి, ఎదురుగా నున్న అద్దంలోనుంచి డ్రైవర్ చూస్తాడన్న భయంతో ఆగిపోయింది రాధ!

సమయం చిక్కిందని సంతోషిస్తూ 'అవునవును! ఏ గొప్పతనమూ నాలోలేదనే కాబోలు వరించి మరీ పెళ్లాడేవు నన్ను!' అనేశాను రాధ చెయ్యి గట్టిగా నొక్కుతూ.

'డ్రైవర్ వింటాడు! ఏంటంత చొరవ మీరూనూ?' అనే అర్థం స్ఫురించేలా, నాలుక కరుచుకుని, ముక్కుమీద వేలేసుకుంటూ కళ్లతో కోపపడింది రాధ! అటువైపు తిరిగి ఆకాశంలో కనిపించే మేఘాలను పరిశీలిస్తోంది.

మట్టూరా కనుపించే ప్రకృతి శోభను ఆస్వాదించడంలో కొద్ది క్షణాలు నిమగ్నుల మయ్యాము.

మా కారు 'కొడైకెనాల్' సమీపిస్తోంది. ఎటువైపు చూచినా ఏదో ఒక అందమైన దృశ్యమే! నే చూసిన ఒక వింత అందాన్ని రాధకు చూపిద్దామని ఆమెను పిలిస్తే ఆమె కనుగొన్న మరో దృశ్యాన్ని చూడమంటూ ఆమె నన్ను పిలిచేది. కన్నులకు విశ్రాంతి లేకుండా ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూస్తున్నాము.

నే నా ప్రాంతాల్లో ఉద్యోగంచేసే రోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆ రోజుల్లో అక్కడున్న ముఖ్యమైన ప్రదేశాలన్నింటిని నే చూసేశాను. ఒక్కొక్క స్థలం నాలో ఒక్కొక్క నూతన చైతన్యాన్ని కలిగించేది. ఆ ఉత్సాహంలో, ఏవేవో కథలు రాసేవాడిని. ఉద్యోగరీత్యా ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్లవలసి వచ్చినప్పుడు చాలా బాధ పడ్డాను. ఆ ప్రాంతాలన్నీ మళ్లా కళ్లబడుతూంటే, ఆ కథలూ, ఆ కథల్లోని పాత్రలూ కళ్లకుకట్టినట్లుగుపిస్తున్నాయి. అన్నికథలు రాయడానికీ, అన్ని బహుమతులు పొందగలగడానికి నా గొప్పతనంకంటె, రాధ చెప్పినట్టు ఇచ్చటి ప్రకృతిమాత యిచ్చిన దోహదమే కారణమేమో ననిపించింది.

కిటికీకానుకుని, ఆలోచనల్లో తేలుతూ, అలా బయటకు చూస్తున్నాను, హాయిగా సాగిపోయే మా కారులోనుంచి! వింత ఆకారంలోనున్న పెద్ద మామిడిచెట్టొకటి ఓ అర ఫర్లాంగు దూరంలో కనిపించింది. ఆ చెట్టుక్రింద కూర్చుని నే రాసిన కథ ఒకటి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఒక్క క్షణం పాటు నన్ను నేను మరిచాను. ఏదో నూతనానుభవం!! అది ఎలాంటిదో చెప్పలేను. ఆ కథలోని నాయిక, సరోజ (ఆమె రూపం బహుశా నాకొక్కడికే తెలుసు!) వయ్యారంగా రెండడుగులేసి, ఆ చెట్టుక్రిందనుండి మావైపు వస్తున్నట్లయింది. తేరిపార అటువైపు చూశాను. సరోజ అక్కడ ఆగి, చిరునవ్వు నవ్వుతూ వంగి నాకు నమస్కరించింది. ఆనాడు ఆమెను నే వర్ణించిన దానికంటె అందంగా, మెరుగుపెట్టిన బంగారంలా తళతళలాడుతూ కనిపించిన ఆ రూపాన్ని వింతగా చూసి, చిన్నగా నవ్వాను. ఆ చెట్టునుండి మా కారు దూరంగా వచ్చేయడం సహించలేక, అప్రయత్నంగా, కిటికీలోనుండి బుర్రదూర్చి వెనక్కు తిరిగి చూశాను.

'స్వామీ! ఏమీవింత? మీ మందహాసంబున కేమి కారణంబు?' అంటూ హేళనగా అడిగేసింది రాధ నా భుజం పట్టుకొని. నా బుర్రని కారులోకి తీస్తూ, ఒక్కసారిగా షాక్ తిన్నట్లయింది నాకు. కారులో వెళుతున్నట్టుగాని, ప్రక్కన రాధ వున్నట్టుగాని ఒక్కక్షణం క్రితం నాకు

తెలీదు !!

రాధని విదుల్చుకుని మళ్ళీ ఆ చెట్టువైపు చూశాను. సరోజ కనిపించలేదు. మనసదోలాగయింది. ఆ అనుభవం ఏదో చాలా కొత్తగా కనిపించింది. నేనూహించిన 'సరోజ' కేవలం నా ఊహాగానాల్లో కనిపించే వ్యక్తిత్వం కాకుండా, చాలా సహజంగా, చాలా నిజంగా, నా ఎదురుగా ఉన్నట్లే కనిపించింది. 'సరోజ' బహుశా ఇక్కడ నివసిస్తోందేమో!' అనుకున్నాను చాలా యాదాలాపంగా!

'అదెలా సాధ్యం?' అని నా మనసడుగనూ లేదు, దానికి సమాధాన మివ్వడానికి నే యాతన పడనూ లేదు!

రాధ నా సమాధానం కోసం ఎదురు చూస్తోంది. ఏం జెప్పాలో తెలీలేదు. ఎంత మరచి పోదామనుకున్నా ఆ సంఘటన జ్ఞాపకం వస్తోంది. నే సృష్టించిన పాత్ర నిజంగానే ఓ రూపం దాల్చి, ఇక్కడ నివసిస్తోందేమో అని ఓ కొత్త ఆలోచన పట్టింది. గుండెలు గతుక్కుమన్నాయి. మరీ దూరంగా పోయిన ఆ మామిడిచెట్టు వైపు మరోసారి చూశాను. నాలో ఏదో కలవరం బయల్దేరింది. నా ముఖ కవళికల్లో మార్పు గ్రహించిన రాధ.

'ఇంతవరకూ బాగానే వున్నారు, ఇంతలో ఏమయింది? ఏదైనా చూసి భయపడ్డారా?' అనేసింది.

అద్దంలో కనిపించిన నా ముఖం చూసుకుని నేనే ఆశ్చర్యపోయాను! ఒక్క క్షణంలో ఏమిటీ మార్పు? చెప్పలేని నీరసం ఏదో నన్నావరించింది. కారొకసారి ఆప మన్నాను. 'ఎందుకూ?' అని నా చెయ్యి పట్టుకున్న రాధను కూడా నాతోపాటు క్రిందకు దింపాను. ఆ మామిడిచెట్టు వైపు మరోసారి చూశాను. ఏమీ కనిపించలేదు. కారెక్కి, డ్రైవర్ని వచ్చిన దారమ్మటే మళ్ళీ కొంత దూరం వెళ్ళమని అడిగాను. కారు ఆ మామిడిచెట్టు వైపు వెళ్తోంది. పరీక్షగా అటు వైపు చూశాను.

'ఆ చెట్టుక్రింద ఎవరైనా వున్నట్టు నీకు తెలుస్తోందా రాధా?' అనడిగాను, కంగారు చేయిస్తూ !

'లేదే! ఏమీ తెలియడం లేదే' అంది రాధ వింతగా! నాకు కూడా ఏమీ కనిపించలేదు. నాలో పట్టుకున్న అనుమానం కాస్త వదిలిపోయింది. మనసు ధైర్యం పడింది.

'సారీ రాధా! అక్కడెవరో వున్నట్టయింది ఇందాకా మనం ఈదారిన వెళ్ళినప్పుడు. ఎవరో కాదు - సరోజ కనిపించినట్లయింది. అందుకే వెనక్కు తీసుకొచ్చాను!' అంటూ రాధను కార్లో కూర్చోపెట్టాను.

సరోజ యెవరో రాధకు మొదట్లో అర్థం కాక తికమకపడింది. నాకు కలిగిన ఆ వింత అనుభూతి విని పకపకా నవ్వేసింది. 'నే పక్కనుండగా లోకంలోని సరోజల మీదకి ఎందుకండి మీ మనసు!' అనేసింది తేలిగ్గా! 'సారీ. మీకలా అనిపిస్తే మాత్రం ఆ ఆలోచన కంత ప్రాధాన్యత యిచ్చి, కారు వెనక్కు తీసుకురావడం బలే బావుంది. అయినా ఒక కథలో పాత్ర నివసించడ మేమిటండీ, మీ పిచ్చిగానీ?!' రాధ పకపకా నవ్వుతోంది. సిగ్గుపడి పోయాను. నే చేసిన పని నాకే చిరాగ్గా తోచింది, 'ఒకవేళ సరోజ జ్ఞాపకం వస్తే వచ్చింది. ఆమె నిజంగా అక్కడ వుంటుందని భ్రమపడి, కారును వెనక్కు తీసికెళ్ళమనడం—ఛ—చాలా సిల్లీగావుంది!' అని నాలో నేనే తిట్టుకున్నాను.

ఆ ఆలోచనలు మరచి పోడానికి ఎంతో సేపు పట్టలేదు! నా మనసు కొంచెం పాడయిందని తేలిగ్గా పసిగట్టిన రాధ నన్ను ఉత్సాహ పరచడానికి కొంచెం శ్రమ తీసుకుంది. కొద్ది క్షణాల్లోనే ఆ వింత సంఘటనని మరచిపోయి, ప్రకృతి సౌందర్యాన్ని—వింత వింత దృశ్యాల్ని మార్గంలోనూ, ఆనందించడంలోనూ, నిమగ్నుల మయ్యాము. వంకర టింకర రోడ్లన్నీ దాటుకుని. మధ్యాహ్నం ఒంటిగంటయేసరికల్లా కొడైకెనాల్లో మా లాడ్జికి చేరుకున్నాం.

వరుసగా ఆరుగంటలు ప్రయాణం చేసి రావడంతో వొళ్ళంతా బడలికగా వుంది. భోంచేసి పడుకున్నాము.

* * *

సాయంత్రం నాలుగ్గంటలు కాకుండానే రాధకి మెలకువ వచ్చేసింది. నన్ను కూడా లేపేసింది. నాకింకా నిద్రమత్తు వదల్లేదు. బద్ధకంగా లేచి పడక్కుర్చీలో కూర్చున్నాను.

'అలా ఊరు చూడ్డాని కెళ్దామన్నారుగా? అప్పుడే నాలుగయింది. మరి తయారవండి!' అంటూ రాధ నాకు బాగా మెలకువ రప్పించడానికి ప్రయత్నించింది!

'నీ ముస్తాబింకా అవ్వలేదుగా! అప్పుడే నన్నెందుకు లేపేశావు?' అంటూ కుర్చీలో తాపీగా పడుక్కున్నాను.

'ఈ పేంటు బాగానే వుందిలెండి. ఈ స్లాకువేసుకోండి దానిమీదకి బాగా మేచవుతుంది నా టాయిలెట్ ఎంత, జస్ట్ టెన్ మినిట్స్!' అంటూ, ఓ స్లాక్‌షర్ట్ నా వొళ్ళో పడేసి, 'టాయిలెట్'లోకి దారి తీసింది రాధ.

నా రాధ టాయిలెట్ - స్నానంతో మొదలవుతుంది. ఆమె ముస్తాబయి రాడానికి అధమం ఓ అరగంటయినా పడుతుంది. 'థేంక్, గాడ్!' నిద్రపోడాని కింకా ఓ అర గంట టయిముంది!' అనుకుంటూ తాపీగా పడుకున్నాను.

బాల్కనీలోనుంచి చల్లని గాలి వీస్తోంది. ప్రాణాని కెంతో హాయిగా వుంది. ఇంక నిద్ర వచ్చేటట్టులేదు. అయినా, అలాగే సుఖంగా పడుకోవాలనిపించింది. చల్లని ఆ పిల్ల వాయువులు నన్ను తగల్డంతో నా వళ్ళు నే మరచిపోయిన ఆ క్షణంలో...

తలుపు తెరచుకొని ఎవరో లోపలికి వచ్చారు. ఆ అలికిడి విని. ఎవరోనని అటు వైపు చూశాను. ఎవరోకాదు...రాధిక!

'అరే, ఎన్నాళ్ళకు మళ్ళీ నిన్ను చూడ గలిగేను రాధికా!' అనుకుంటూ వింతగా ఆమెవైపు చూశాను.

మౌనంగా గుమ్మందగ్గర నిలబడ్డ రాధిక చిన్నగా నవ్వింది. చక్కని పట్టుచీరలో పెళ్ళికూతురు ముస్తాబుతోనున్న రాధిక, 'ఇలా రండి, ఓ చిన్నమాట!' అనిపించేటట్లు సంజ్ఞచేస్తూ, మాట్లాడకుండానే నన్నాహ్వానించింది, 'రాధ చూస్తే బావుండదని అనుకుంటూ ఓ మాటు బాత్‌రూమ్‌వైపు చూసి. రాధ ఇంకా రాదని ధైర్యం తెచ్చుకుని, వొళ్ళోవున్న స్లాక్‌షర్ట్ అప్రయత్నంగానే తొడిగేసుకుని, మెల్లిగాలేచి గుమ్మం దగ్గర కెళ్ళాను. ఏమీ మాట్లాడకుండానే రాధిక నన్ను నడిపిస్తోంది. ఏదో మంత్రించబడ్డవాణ్ణిలా, ఎందుకో ఎక్కడికో కూడా అడక్కుండానే ఆమె వెంట నడిచేస్తున్నాను. ఎదురుగానున్న ఒక చక్కని పూలతోటలోకి తీసికెళ్ళింది రాధిక ఆ పూలతోటతో నాకు పరిచయమున్నట్టు జ్ఞాపకం వచ్చింది. నా జ్ఞాపకం ప్రకారం అటువారగా ఒకసిమ్మెంటు

# పాత్రలకి ప్రాణంవస్తే?

సోఫాలాంటిది వుండాలి! అది అక్కడుంది. రాధిక నన్నక్కడికి తీసికెళ్ళింది. సోఫాలో కూర్చోమని చూపించింది. అయోమయంగా కూర్చుని రెప్పవాల్చకుండా ఆమె వైపు చూస్తున్నాను. ఆమె నెలా పలకరించాలో అర్థంకాలేదు.

తన చక్కని కంఠం విప్పింది రాధిక. 'ఇలా చూడండి మోహన్! నన్ను చూస్తే మీకు జాలి వేయడం లేదూ? ఇంత అందంగా ఇన్ని కోరికలతో నన్ను సృష్టించారు. ఓ చక్కని అబ్బాయిని చూపించి ప్రేమించమన్నారు. తీరా నేనతన్ని ప్రేమించి, పెళ్ళాడుదామనుకున్న సందర్భంలో, బాల్యావస్థలోనే భర్తను పోగొట్టుకున్న నిర్భాగ్యురాలిని నేనని అందరికీ చెప్పి, నన్నూ మిమ్మల్నీ అందరూ మెచ్చుకుంటారని నే ప్రేమించినవాణ్ని నాకు కాకుండా చేసేశారు. ఈ పెళ్ళి దుస్తుల్లోనే, ఇలాగే నన్ను జీవితాంతం ఉండిపొమ్మని నాకు శిక్ష విధించారు. నాకు మరో పెళ్ళి కావడం మీకు ఇష్టంలేకపోతే, కనీసం ఆనాడే నన్ను కూడా చంపేయాల్సింది. ఈ పూలతోటలోనే నన్ను సృష్టించి, ఇక్కడే నాకిన్ని కోరికలు కల్పించి, ఇక్కడే నా కీగతి కల్పించారు! నా పాతివ్రత్యానికి ఏ భంగమూ రాకుండా ఉండాలని మీ ఆశ అయితే, సునాయాసంగా, ఏ విషమో పెట్టి నన్నారోజునే మీరు చంపవలసింది. అందాన్నీ, వయసునీ, అన్నింటినీ ఇచ్చి, ఇలాగే ఉండిపొమ్మని కఠినశిక్ష విధించారు! నా పరిస్థితి చూస్తే మీకు ఏడుపు రావడంలేదూ?' అంది రాధిక! ఆమె కనుకొలకులనుండి రెండుమూడు కన్నీటి బిందువులు రాలాయి.

రాధిక చెప్పింది అక్షరాలా నిజం! ఆమెను చూస్తే నాకే ఏడుపొచ్చింది. ఆనాడామెను అలా చేశాను గనకే, నేనొక ప్రఖ్యాత రచయితనని ప్రజలందరూ తెల్సుకున్నారు. అందరూ నాకు భరతం పట్టేరు!!

ఆమె కెలా సమాధాన మివ్వాలో అర్థం కాలేదు. తడిసిపోయిన కళ్ళనుమాత్రం తుడుచుకుంటూ అయోమయంగా ఆమె వైపు చూస్తున్నాను.

'జరిగిందేదో జరిగింది. నాకు మీరు ప్రసాదించిన పవిత్రతను నేనలాగే కాపాడుకోడం కోసం నాకో ఉపకారం చెయ్యండి. ఈ పిస్టల్‌తో నన్ను పేల్చి చంపేయండి. చిన్ననాటి నా భర్త ఎలా గుండెవారో చెప్పండి. ఆయన్ను తల్చుకుంటూ ఈ దేహాన్ని విడుస్తాను' అంటూ నా చేతిలో ఓ పిస్టల్ ఉంచింది రాధ.

నా చేతులు గజగజలాడాయి! 'వద్దు. నేనీ పని చేయలేను. అయినా -- నువ్వు చస్తే ఎలా? నీలాటివాళ్ళ ఉపాధం సంఘానికి ఉత్తమమైన పాఠాలు నేర్పాలనే నిన్నలా ఉంచేశాను. అయినా, ఇప్పుడు నీకీ గొడవంతా అనవసరం! నే వెళ్తాను అవతల రాధ నాకోసం వెయిట్ చేస్తూంటుంది!' అంటూ ఆ పిస్టల్ అక్కడే పారేసి, గబగబా పూల తోట దాటుకుని మా లాడ్జివైపు వచ్చేస్తున్నాను. వెనుకనుంచి ఏదో ఘోరమైన శబ్దం వినిపించింది' చూడ్డానికి భయమేసింది. గబగబా నడుచుకుంటూ అక్కడనుంచి దూరంగా వచ్చేశాను.

మా లాడ్జివైపు వెళ్ళబోయే నన్ను మరోవైపు కొంచెం దూరంగా కనిపించిన ఒక స్త్రీ ఆకర్షించింది. ఆమెకు నలభైయేళ్ళుండవచ్చు. వయసు కుదిగని వయ్యారం ఒలకబోస్తూ, నన్ను చూసి, మందహాసంతో పమిట సర్దుకుంది! ఆశ్చర్యంగా అటువైపు చూశాను. అప్రయత్నంగా నా కాళ్ళు అటువైపు నడిచాయి. చిరునవ్వుతో ఆమె నన్నాహ్వానించింది. అది తనుండే ఇల్లులాగుంది లోపలకు రమ్మని దారి చూపించింది. వెళ్ళకూడదనుకుంటూనే లోపలి అడుగుపెట్టాను.

ఆమె నాకెంతో గౌరవం చేసింది. 'మీ దయవల్ల నే కోరుకున్న వరుడికిచ్చి పెళ్ళి చేశారు. ఇప్పుడు మాకిదరు పిల్లలు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థంకాకుండా వుంది. ఆయనలా బయటికి వెళ్ళారు. మీకీ మా పిల్లలిద్దరూ!' అంటూ దబ్బపండులా మెరిసిపోతున్న తన పిల్లలిద్దర్నీ నా దగ్గరికి పంపించింది. తృప్తిగా వాళ్ళను దగ్గరకు తీసుకున్నాను. ఒకసారి ఆమెవైపు చూశాను. మొట్టమొదటిసారిగా ఆమెను నే చూసినప్పుడామెలో ఎంత వయ్యారం వుందో అంత వయ్యారమూ ఆమెలో కనిపించింది. వయసుతో ఆమెకు సంబంధం లేదు. ఆమె కళాజీవి! కళలో పుట్టి, కళలో పెరిగింది. తన కళారూపాన్ని ఆస్వాదించే ఒక చక్కని నాయకుణ్ని ఏరుకుని పెళ్ళిచెయ్యమంది. అతను కూడా ఆమె కోరికకేమీ అడ్డుచెప్పకపోయేసరికి, ఆ యిద్దరికీ పెళ్ళిచేశాను. అప్పుడే ఓ పదేళ్ళకితం అప్పుడు నాకు సమంగా ఓ ఇరవైయేళ్ళుండవచ్చు. ఈ కళాజీవు లిద్దర్నీ సృష్టించి వారి కథ సుఖాంతం చేశాను. ట్రాజెడీ అంటేనే ఆ రోజుల్లో నాకు భయం. పైగా ఏ కథనైనా దుఃఖాంతం చెయ్యాలంటే చాలా బాధపడేవాణ్ని. పరమ సంతోషంతో ఆమె తన జీవితాన్ని గురించి చెప్పుకుపోతుంటే వాళ్ళంత అదృష్టవంతులీ ప్రపంచంలో మరెవ్వరూ లేనట్టనిపించింది!

అవతల రాధమాట జ్ఞాపకం వచ్చి, కుర్చీలోంచి లేచి. 'మరి నే వస్తాను!'



అంటూ ఆమెనుండి సెలవు తీసుకున్నాము. 'వెళ్ళి రండి,—మా యింటికి వచ్చినందుకు చాలా ధన్యవాదాలు!' అనేలా ఆమె నవ్వుతూ తన పిల్లల్నిద్దర్నీ దగ్గరకు తీసుకుంది.

గడియారం చూసుకున్నాము. అప్పుడే రాధ స్నానంచేయడానికి వెళ్ళి పదినిముషాలయింది. మరో పది, పదిహేనునిముషాల్లో టాయిలెట్ అయివచ్చేస్తుంది. చప్పున నే లాడ్జి చేరుకోవాలి అనుకుంటూ అటువైపు నడుస్తున్నాను.

వీనులకు విందుగొలిపే వీణానాదం. ఎక్కడ్నించో వచ్చి నా చెవుల్లో పడింది! తేరి పారి అటూ యిటూ కలయజూశాను. ఎదురుగా వున్న పార్కులో, కొంచెం దూరంగా, ఆ ఎర్రరంగు పూల మొక్కలమధ్య—'కృష్ణారావు'—చక్కని గ్లాస్కో దుస్తుల్లో మిల మిలా మెరిసిపోతున్న కృష్ణారావు వీణ వాయించడం కనిపించి ఆశ్చర్యపోయాను! అతని కెదురుగా ఓ అయిదు గజాల దూరంలో—అతని 'భామ'—కన్నులకు మిరి మిట్లుగొలిపేలా చక్కగా నృత్యం చేస్తోంది! ఆమె ఒంటిమీదున్నన్ని తళుకు. ఆమె ప్రతి కదలికనూ ఆమె కొక కొత్త అందాన్ని స్తోంది. అనుకోకుండానే అటువైపు నడచాను. అతని వీణపాట, ఆమె నృత్యమూ, పరాకాష్ఠ నందుకున్న ఆ సమయంలో—మరీ దగ్గరగా వెళ్ళి చూడడం బావుండదని, ఓ ఇరవై గజాల దూరంనుంచి ఓచెట్టుచాటుగా నిలబడి ఆనందంగా ఆ దృశ్యం చూస్తున్నాను. రెండు మూడు నిముషాలు కాకుండానే అతని పాట, ఆ 'భామ' నృత్యం కూడా ఆగిపోయాయి.

గిల్లు గిల్లున గజ్జెల చప్పుడు చేసు

# పాత్రలకి ప్రాణం వస్తే?

కుంటూ, ఆమె నావైపు వస్తోంది. కృష్ణారావు ఆమె ననుసరిస్తున్నాడు వీణ అక్కడే వదిలేసి! 'కొంపదీసి వాళ్ళు నన్ను చూడలేదుకదా!' అని భయపడుతూ, చెట్టు చాటుగా నక్కి నక్కి నిలబడ్డాను. వాళ్ళిద్దరూ తిన్నగా నాదగ్గరకే వచ్చారు.

'పరవాలేదు. మీరు మమ్మల్ని చూసి నందుకు మేమేమీ అనుకోలేదు. మిమ్మల్ని చూసిపోదామనే వచ్చాము. కులాసాగా వున్నారా? మీకిప్పుడు పెళ్ళయిందా? పిల్ల లేవన్నానా? మందస్మిత వదనంతో ఆ 'భామ' నాపై ప్రశ్నల వర్షం కురిపించింది. చక్కని దుస్తుల్లో చక్కని విలాస పురుషుడిలా మెరిసిపోతున్న కృష్ణారావు కూడా చమత్కారంగా నవ్వుతూ, నా సమాధానం కోసం ఎదురు చూశాడు!

బదులు పలకకుండావుంటే బాగుండ దనుకుని, 'ఓ! బాగానే వున్నాను. 'రాధ' అనే ఓ చక్కని అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడేను. లేదు — ముందు రాధే నన్ను ప్రేమించిందనుకోండి! ఈ మధ్యనే మా పెళ్ళయింది. ఇప్పుడిద్దరం కలిసే వచ్చాం! ఎదురుగా కనిపిస్తోంది చూడండి ఓ పెద్ద మేడ! అదే మా లాడ్జి! రూమ్ నెంబర్ నాలుగులో వుంటున్నాం సాయంత్రం ఏడు గంటలకల్లా తిరిగి రూమ్‌కి వచ్చేస్తాం. ఆ తర్వాత ఏ నిమిషంలో మీరొచ్చినా, నా రాధని కలుసుకోవచ్చు. తప్పకుండా రండి. మీకోసం మేమిద్దరం వెయిట్ చేస్తాం! మీ కింకా, పిల్లా పీచూ ఏమీ బయల్దేరలేదా?' అనేశాను గబగబా!

సిగ్గుగా వాళ్ళిద్దరూ ఒకరిముఖాలొకరు చూసుకున్నారు. వాళ్ళకు పిల్లాపీచూ బయల్దేరకూడదని, శాశ్వతంగా వాళ్ళలాగే నిత్య నూతన వధూవరులుగా, నృత్యగానాల్లో తేలుతూ వుండాలని ఆనాడు — వాళ్ళను సృష్టించిననాడు నే కోరుకున్న కోరిక జ్ఞాపకం వచ్చి, నే వేసిన ప్రశ్నకి నన్ను నేనే మందలించుకున్నాను. వాళ్ళలాగే వున్నందుకు తృప్తిగా, ఆనందంగా వాళ్ళ వైపు చూశాను!


'తప్పక వస్తాము! సాయంత్రం ఏడున్నర కల్లా మీ లాడ్జికి వస్తాము. మరి సెలవా?' అంటూ వాళ్ళిద్దరూ సెలవు పుచ్చుకుని మళ్ళీ అటువైపు వెళ్ళి పోయారు. అతను ఒడిలోకి వీణ తీసు కున్నాడు. ఆమె కాలిగజ్జెలు సవరించు కుంటోంది! 'పరిపూర్ణ కళాజీవులు! అదృష్టవంతులు!!' అనుకుంటూ, రాధ మాట జ్ఞాపకం వచ్చి వెంటనే మా లాడ్జి వైపు బయల్దేరాను.

చేతి గడియారం వైపు చూసుకున్నాను. రాధ టాయిలెట్ చాలావరకూ పూర్తయి వుంటుంది. మరో అయిదునిముషాల్లో పడక గదిలోకివచ్చి, నాకోసం వెతుకుతుంది. ఆ లోపున నే వెళ్ళి, ఏమీ ఎరగనివాడిలా, ఆ కుర్చీలో పడుక్కోవాలి! అనుకుంటూ వేగం హెచ్చించి మా లాడ్జివైపు నడుస్తున్నాను.

నా వెనకాలే ఎవరో వస్తున్నట్లయింది. వెనక్కు తిరిగిచూశాను. ఎవరూ కనిపించ లేదు. ఎవరూ లేరని తెలుసుకుని మళ్ళీ నడుస్తున్నాను. ఎవరో నన్ననుసరిస్తున్నట్లు మళ్ళీ అనిపించి, చిరాగ్గా వెనుదిరిగి చూశాను. మళ్ళీ ఎవరూ కనిపించకపోయే సరికి నా అనుమానానికి నాలో నేనే కొప్పడి ముందుకు నడిచాను. ఈసారి నిజంగానే ఎవరో నన్ను తరుముతున్నట్లయింది. అలాగే నిలబడి గట్టిగా వెనక్కి చూశాను. మసకగా, 'వాసంతి' రూపం నన్నువెంటాడు తున్నట్లు తెలిసింది. గుండెలు గతుక్కు మన్నాయి! ఆమె రూపం నన్ను సమీపిస్తోంది. అయినా, ఆమె నా కళ్ళకి సమంగా కనిపించడంలేదు. సమంగా చూద్దా మని నే చేసే ప్రయత్నంలో నా కళ్ళు నొప్పి పెడుతున్నాయి.

'హలో! మిస్టర్ మోహన్, నేనెవర్నో జ్ఞాపకం వుందా?' అంది ఆమె కంఠం.

'జ్ఞాపకం లేకేమి! వాసంతివి! సమంగా



కనిపించవేం? ఎందుకిలా తరుముకొస్తావు?' అన్నాను.

'దుర్మార్గుడా!' అంది ఆ రూపం కొంచెం కోపంగా! మరింత కోపంగా ఆమె వైపు చూశాను. ఆమె అంతటితో ఆగలేదు. 'నిజంగా నేనెలా కనిపిస్తా ననుకున్నావు?' ఎన్నో తీరని కోరికలున్న యౌవనంలో, నీ కసాగమనం కోసమని — నలుగురూ నిన్ను మెచ్చుకుంటారని — నిష్కారణంగా నన్ను చంపేశావు. దెయ్యాన్నయి ఇలా మసులుతున్నాను. నాకింత అన్యాయం జెయ్యడం వల్ల నీకేమిటొచ్చింది?' అని నిలదీసి అడిగింది.

చప్పున లాడ్జికి వెళ్ళిపోదామంటే ఏమిటీ అడ్డంకులన్నీ నని నా వొళ్ళు మండింది. 'మరే సమయమూ లేనట్టు — ఈవిడ కూడ నాకిప్పుడే కనిపించాలా!' అనుకొంటూ చాలా అలక్ష్యంగా ఆమెకు సమాధాన మిచ్చాను. 'ఏమిటొచ్చిందని ఇంకా మెల్లిగా అడుగుతావేం? నిన్ను చంపడంతోనే, ఆ కథ యొక్క పవిత్రత అంతా నిలబడిందని ప్రజ అందరూ నన్ను వేనోళ్ళ పొగిడేరు! సినిమా వాళ్ళు ఆ కథకి ఒక చక్కని రూప కల్పన చేసి లక్షలు సంపాదించుకున్నారు!! అంత మంచి కథ రాసినందుకు నాకు రాష్ట్రపతి బహుమానం కూడా ఇచ్చారు!!! ఇంత కంటె ఏం కావాలి?!'

'అవున్లే! అంతే! నువ్వెంతో మంచి వాడి వనుకున్నాను మోహన్! నువ్వందరు రచయితల్లాంటి వాడివి కాదని, నాకు నీ దగ్గర చక్కని ఆదరణ లభిస్తుందని, వెతుక్కుంటూ నీ కల్పనా ప్రపంచంలోకి వచ్చి నీకు దర్శనమిస్తే, నిరాకరించావు.' మొదట్లో నీవు నాకు చూపించిన మర్యాద గౌరవం చూసి ఎంతో సంతోషించాను. నిజంగా జ్ఞాపకంతెచ్చుకో! నన్ను చంపుదామనే ఉద్దేశం నీకు మొదట్లో ఏమాత్రమూ లేదు. నీవు రాస్తున్న నా కథని నీ స్నేహితుడికి చూపించావు. ఆ పాడు స్నేహితుడు నీకీ బుద్ధి కలిగించాడు. కామెడీ కంటె ట్రాజెడీకి వెయిటెక్కువుంటుందని. నన్ను చంపేస్తే నీకు పెద్ద భవిష్యత్తుంటుందని, నిన్ను రెచ్చగొట్టేడు. వాడి మాటలకు లొంగి, ఎంతో భయపడుతూనే నీవీ పాపపు పనికి దారి తీశావు. చిన్న వయసులోనే నన్ను చంపేశావు! దెయ్యాన్నై ఇలా నే నింకా ఎంతకాలం వుండాలి? మోహన్! ఇప్పుడు నువ్వు నా చేతుల్లో ఇరుక్కున్నావు. ఎలా వెళ్తావో నేనూ చూస్తాను. ఒక్క అడుగు ముందుకేశావో నీ భరతం పడ్తాను!' అంటూ జడిపించింది వాసంతి! నావొళ్ళంతా చెమటలు పోశాయి.

చేసేదిలేక, బతిమాలుకోడం మొదలెట్టాను. 'వద్దు వాసంతీ! వద్దు! నన్నేమి చేయకు! అసలే పాపం, రాధ! నాకోసం నిరీక్షిస్తూ వుంటుంది! నే కుర్చీలో కనిపించకపోతే దడుసుకుంటుంది. నన్ను వెళ్ళనియ్యి! సుఖంగా నా నాలుగు రోజులు గడపొచ్చని, యిద్దరమూ మొట్టమొదటి సారిగా ఇక్కడికి హనీమూన్‌కి వచ్చాము! నీ కింత అన్యాయం జరుగుతుందని ఆనాడు నే ననుకోలేదు! రాష్ట్రపతి యిచ్చినబంగారు పతకం నాకు వద్దు. దాన్ని చూసి యిక మీదట నేనెవిూ గర్వ పడను. నన్ను వెళ్ళనియ్ వాసంతీ!' నా కళ్ళనుండి నీళ్ళు కారుతున్నాయి.

వాసంతి నన్ను వెళ్ళనివ్వలేదు!

దగ్గరగా వచ్చేస్తోంది.

గట్టిగా నన్ను కావలించుకుంది!!

హడలిపోయాను!!

'రాధా,' అంటూ బిగ్గరగా పిలుదామనుకున్నాను. నోటినుండి మాటరాలేదు.!

శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను — 'రాధా! రాధా! రాధా!......' అనడానికి......

......నా రాధ,...నా పాలిటి రాధ – నిజంగానే వచ్చి, ఆ వాసంతి కౌగిలినుండి నన్ను రక్షించింది!!

భుజంమీద గట్టిగా తట్టి, 'ఏమిటది, మాటిమాటికీ నా పేరు కలవరిస్తున్నారు? ఏదీ మళ్ళీ పిలవండి 'రాధా' అని!' అంది పడక కుర్చీ పక్కన కూర్చుంటూ.

పడక కుర్చీలోకి నే నెలా వచ్చానో ఎప్పుడొచ్చానో అర్థం కాలేదు. నాళ్ళో రాధ పడేసిన స్లాకు షర్టు అక్కడే వుంది. వంటినిండా చెమటలు! బుర్ర ఒక్కసారి విదిలించాను! జరిగిందంతా కలలాంటి దని తెలుసుకుని ధైర్యపడ్డాను. ఇది నిర్ధారణ చేసుకోడానికి 'రాధా' అని పిలిచాను. చాలా తేలిగ్గానే పిలవగలిగాను. నాకేం జరిగిందో అర్థం కాక, అయోమయంగా నా వైపు చూసింది రాధ! రాధ నిజంగానే తన ముస్తాబు పూర్తి చేసుకుంది!

'నిద్ర మత్తు ఇంకా వదల్లేనట్టుంది. వదల్చమంటారా?' అంటూ రెండుచేతులతో పట్టుకుని కుర్చీలోంచి నన్ను లేవదీసింది రాధ.

నే సృష్టించిన కళాజీవుల్ని నే నెలా చూడగలిగానో విన్న రాధ, మొదట్లో తేలిగ్గా నవ్వేసినా, నా పాత్రలకూ నాకూ వున్న సంబంధం చూసి జాలిపడింది.

'అందుకే మీరు సృష్టించిన ప్రతి పాత్రలోనూ జీవం ఉట్టిపడుతుంది!' అంది నా రాధ.

'కృష్ణారావునూ భామనూ నిజంగానే మీరు చూశారండీ? వాళ్ళిద్దరు మనకు లాగానే వున్నారా? లేకపోతే వేరుగా వున్నారా?' అని కూడా అడిగేసింది. నా కథ లంటే రాధ కెంతో యిష్టం!

తప్పక వస్తామన్న కృష్ణారావూ భామల కోసం ఆ రాత్రి ఏడున్నరకి నే నెదురు చూడక పోలేదు! వారు రాకపోయేసరికి, ఆ మధ్యాహ్నం ఆ అరగంటలోనూ జరిగినది నిజంగా కలేనని నిర్ధారణ చేసుకున్నాను! ●

